క్లుప్తంగా

పందుల చోరీ

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో శ్రీరాముల పోచంకు చెందిన పందులను ఆదివారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు కారులో దొంగిలించుకొని పరారయ్యారు. వివరాలు ఇలా ఉన్నాయి.. కాళేశ్వరంలోని గుండం చెరువు కట్టమీద ఆంజనేయస్వామి ఆలయం సమీపంలో గుర్తు తెలియని కొందరు వ్యక్తులు వలలు అడ్డం పెట్టి మూడు పందులను కారులో ఎక్కించుకొని తీసుకువెళ్లారు. అక్కడి సీసీ కెమెరాలో పందులు దొంగిలించినట్లు నిక్షిప్తం అయింది. కారుకు నంబర్‌ప్లేట్‌రు కనిపించకుండా మసిపూసినట్లు ఉంది. ప్రస్తుతం మూడింటి విలువ రూ. 60వేలు ఉంటుందని బాధితుడు తెలిపాడు. ఈమేరకు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కాగా, ఎమినిది నెలల కిందట ఇదే పోచంకు చెందిన 10 పందులను దొంగిలించుకుపోయారు. వాటి విలువ రూ. 2లక్షల వరకు ఉంటుందని తెలిపాడు. పోలీసులు దొంగలను గుర్తించి తనకు న్యాయం చేయాలని కోరాడు.

ఎమ్మార్పీఎస్ జిల్లా కమిటీలో చోటు



టేకుమట్ల: మండలంలోని సుబ్బక్కపల్లి గ్రామానికి చెందిన రేనుకుంట్ల సంపత్‌కు ఎమ్మార్పీఎస్ జిల్లా కమిటీలో చోటు దక్కింది. సంపత్ నాలుగు సంవత్సరాలుగా ఎమ్మార్పీఎస్ మండల ప్రధాన కార్యదర్శి, అధికార ప్రతినిధి, మండల ఇన్‌చార్జ్‌గా విధులు నిర్వర్తించాడు. ఆయన సేవలను గుర్తించి జిల్లా కమిటీలో చోటు కల్పించినట్లు జిల్లా అధ్యక్షుడు అంబాల చంద్రమౌళి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా సంపత్ మాట్లాడుతూ.. మండల నాయకుడిగా పని చేసిన తను జిల్లా కమిటీలో చోటు దక్కడంపై బాధ్యత మరింత పెరిగిందని అన్నారు.

'చర్య తీసుకోవాలి'

భూపాలపల్లి రూరల్: ఉపాధ్యాయుల బదిలీ విషయంతో నిబంధనలు పాటించని అధికారులపై చర్య తీసుకోవాలని రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్)జిల్లా అధ్యక్షుడు తిరుపతి మంగళవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాని డిమాండ్ చేశారు. ఇటీవల జరిగిన ఉపాధ్యాయ బదిలీల్లో కొందరు ఉపాధ్యాయులు స్పౌస్ పాయింట్స్ దుర్వినియోగపరచి వారికి అనుకూలమైన ప్రాంతాలను కోరుకున్నారని తెలిపారు. దీని వల్ల మిగతా ఉద్యోగులు నష్ట పోయారని తెలిపారు. ఈ విషయంపై యూనియన్ ఆధ్వర్యంలో పలుమార్లు జిల్లా విద్యాశాఖాధికారికి ఫిర్యాదు చేసినా ఫలితం లేదని ఆవేదన వ్యకం చేశారు.

చేయూత

ములుగు రూరల్: మండలంలోని అబ్బాపూరం గ్రామానికి చెందిన ఉయ్యాల బాబు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబ సభ్యులను సుప్రజ ఆస్పత్రి ఎండీ విజయ్‌కుమార్‌గౌడ్, కేజీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు పరామర్శించి రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. వారి వెంట తాళ్లపల్లి రామస్వామి, సంఘం వరంగల్ అధ్యక్షుడు నర్సయ్య, రవిగౌడ్ తదితరులు ఉన్నారు.

అనారోగ్యంతో యువకుడి మృతి



భూపాలపల్లి రూరల్: అనారోగ్యంతో చికిత్స పొందుతూ.. యువకుడు మృతి చెందిన భూపాలపల్లి పట్టణంలోని కృష్ణ కాలనీలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు, మృతుడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. కృష్ణ కాలనీకి చెందిన సిరికొండ శ్రీనివాస్ (22) మద్యానికి బానిసయ్యాడని తెలిపారు. దీంతో లివర్‌కు చెడిపోయి జిల్లా కేంద్రంలోని 100 పడకల ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడన్నారు. మృతుడు అవివాహితుడు కాగా తండ్రి ఉన్నాడు. తల్లి ఇటీవల కాలంలో మృతి చెందింది. గుడుంబా తాగడం వల్ల కాలనీలో సంవత్సర కాలంలో సుమారుగా ఆరుగురు మృతి చెందినట్లు కాలనీవాసులు తెలిపారు. అధికారులు కృష్ణకాలనీలోని గుడుంబా సావరాలపై దాడులు నిర్వహించి అరికట్టాలని కోరుతున్నారు.

పురుగుల మందు తాగి వ్యక్తి..

భూపాలపల్లి రూరల్: ఇంట్లో భార్యతో గొడవపడి మనస్థాపంతో పురుగుల మందు తాగి వ్యక్తి మృతి చెందిన ఘటన మంగళవారం భూపాలపల్లి పట్టణంలోని సుభాష్ కాలనీలో చోటు చేసుకొంది. పోలీసులు, మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం .. సుభాష్‌కాలనీకి చెందిన రేవెల్లి రమేశ్ (35)ఆటో డ్రైవర్‌గా పని చేస్తూ భార్య సృజనతో కలిసి జీవనం సాగించేవాడు. భార్య అతడితో గొడవపడి వారం రోజుల క్రితం పుట్టింటికీ వెళ్లింది. దీంతో మనస్థాపం చెంది పురుగుల మందు తాగి ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి బావ కేతిరి పోశాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కాగా, మృతికి గల కారణాలను మృతుడు వీడియో తీసీ సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో ఆ వీడియో చక్కర్లు కొడుతుంది.

కార్యదర్శుల సేవలు భేష్

- నిరంతరం గ్రామాల్లో సమస్యలపై ఆరా
- సమస్యలు పరిష్కరిస్తూ ప్రజల మన్ననలు పొందుతున్న పంచాయతీ కార్యదర్శులు



టేకుమట్ల-అంకుషాపూర్ రోడ్డు బురదమయం కావడంతో మరమ్మతు చేస్తున్న సిబ్బంది(ఫైల్)

టేకుమట్ల: సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసిన నాటి నుంచి గ్రామాల బాధ్యతలను తీసుకుని పంచాయతీ కార్యదర్శులు ముందుకు సాగుతూ శభాష్ అనిపించుకుంటున్నారు. మండలంలోని మొత్తం 24 గ్రామ పంచాయతీలకు గానూ అవుట్ ఓర్సింగ్‌లో వచ్చి విధులు నిర్వర్తిస్తున్న నలుగురితో పాటు, మిగతా 20మంది పంచాయతీ కార్యదర్శులు గ్రామాల భారాన్ని మోస్తూ నిత్యం గ్రామస్తులకు అండగా ఉంటున్నారు.

గ్రామాల్లో సవాళ్లను ఎదురిస్తూ..

సర్పంచ్‌లు పదవిలో ఉన్నప్పుడు గ్రామాల్లో అన్ని సమస్యలను పరిష్కరించేవారు. పంచాయతీల్లో నగదు లేకున్నా సొంతంగా ఖర్చు చేస్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సేవలను అందించారు. కానీ సర్పంచ్‌ల పదవీ కాలం ముగియడంతో ప్రత్యేకాధికారుల పాలన ప్రారంభమై ఎన్నో సవాళ్లను పంచాయతీ కార్యదర్శులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా శానిటేషన్, నీటి సరఫరా, సిల్ట్ తొలగింపు, వీధి దీపాల నిర్వహణ, వర్షాకాలంలో వీధుల్లో బురదమయమైన ప్రాంతాలను శుభ్రం చేయుట, చెత్తను తొలగించుట, వాటర్ పైపుల లీకేజీలు, గ్రామ పంచాయతీ ట్రాక్టర్ నిర్వహణ వంటివి పనులు చేస్తు ముందుకు సాగుతున్నారు. సర్పంచ్‌లు లేకున్నా కూడా ముందుడి పనులు నిర్వహిస్తు ప్రజల ప్రసంశలు అందుకుంటున్నారు.

తప్పని తిప్పలు

కార్యదర్శులు గ్రామాల్లో నెలకొంటున్న అన్ని సమస్యలను పరిష్కరిస్తు సొంతంగా వేతనం నుంచి నగదును సైతం వెచ్చిస్తున్నారు. కానీ చేసిన పనులకు చెక్కులను చేపించుకుంటే నగదు జమ కాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సకాలంలో నగదు జమ కాకపోవడంతో అరకొర వేతనాల నడుమ తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదు. గ్రామాల్లో చెత్తను తొలగించడం కోసం గ్రామ పంచాయతీ ట్రాక్టర్ ప్రతీ రోజు తిరగాలంటే డీజిల్ సమస్య పంచాయతీ కార్యదర్శులను వెంటాడుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామాల్లో నిత్యం కొనసాగుతున్న పనులకు నగదును తీసుకునేందుకు చెక్కులను వెంటనే విడుదలయ్యేందుకు అధికారులు సహకరించాలని వారు కోరుతున్నారు.

నిత్యం ప్రజల మధ్యనే..



ఉదయం నుంచి సాయంత్రం వరకు నిత్యం ప్రజల మధ్యనే ఉంటున్నా. గ్రామంలో ఎలాంటి సమస్య తలెత్తినా వెంటనే పరిష్కరిస్తూ ముందుకు సాగుతున్నా. మండల కేంద్రం కావడంతో పని ఒత్తిడి ఉన్నా గ్రామస్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నా. ప్రత్యేకాధికారుల పాలనలోనైనా, సర్పంచ్‌ల పాలనలోనైనా నిరంతరం పనులు చేపిస్తూనే ఉన్నా.

– సాంబశివరావు, పంచాయతీ కార్యదర్శి, టేకుమట్ల

సమస్యలు లేకుండా చేస్తున్నా..



గ్రామంలో సమస్యలు నిత్యం వెంటాడుతున్నా వాటిని సమసర్థవంతంగా ఎదుర్కొంటున్నా. ప్రత్యేకాధికారుల పాలనలో కొన్ని పనులు చేయాలంటే నగదు సమస్య తలెత్తుతోంది. అరకొర వేతనాలతో కుటుంబం, విధుల్లో సైతం పెట్టుబడి పెట్టి పనులు చేపించడం కాస్త ఇబ్బందిగానే ఉంది. చేసిన పనులకు సకాలంలో చెక్కులు విడుదలైతే ఇబ్బంది ఏమీ ఉండదు. అయినా విధుల్లో ఎక్కడా వెనకడుగు వేయలేదు.

– ఎంబాడి స్వామి, పంచాయతీ కార్యదర్శి, ఎంపేడు

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

- ఎమ్మెల్యే సత్యనారాయణరావు

భూపాలపల్లి రూరల్: పేదలకు సీఎంఆర్ఎఫ్ వరమని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 245 మంది బాధితులకు రూ.75 లక్షల విలువ గల చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యానికి ప్రాధాన్యం కల్పించిందన్నారు. ఆరోగ్యశ్రీని రూ.10 లక్షలవరకు పెంచామని, ఆరోగ్య శ్రీలో లేని చికిత్సలకు సీఎంపీఎఫ్ చెక్కులు అందించి ఆదుకోవడం జరుగుతుందన్నారు. అంతకుమందు పట్టణంలోని సాయిబాబా దేవాలయ 10 వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సుభాష్‌కాలనీలో రామాలయం వద్ద సైడ్ కాల్వల నిర్మాణం, రోడ్డు పలనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక కౌన్సెలర్లు దాట్ల శ్రీనివాస్, శిరుప అనిల్, ముంజాల రవీందర్, నాయకులు బుర్ర కొమురయ్య, అప్పం కిషన్, రాంనేని రవీందర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సుంకరి రాంచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

'మంద కృష్ణను విమర్శిస్తే సహించేది లేదు'

- బెల్లంపల్లి సురేశ్



నిరసన తెలుపుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కాళేశ్వరం: మందకృష్ణ మాదిగను విమర్శిస్తే సహించేది లేదని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు బెల్లంపల్లి సురేశ్ అన్నారు. మహదేవపూర్ మండల కేంద్రంలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేకుల దిష్టిబొమ్మతో నిరసన కార్యక్రమాన్ని బెల్లంపల్లి సురేశ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రధాన చౌరస్తా గుండా చావు డప్పులతో శవయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మందకృష్ణ మాదిగ మీద అనుచిత వ్యాఖ్యలు చేస్తు వర్గీకరణలు అడ్డుకుంటే తరిమితరిమి కొడతామన్నారు. ఊసరవెల్లిలా పార్టీలు మార్చిన ఘనత చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ కుటుంబానిదే అని గుర్తు చేస్తూ ఇప్పటికైనా వర్గీకరణకు సహకరించాలని పేర్కొన్నారు. వర్గీకరణకు వ్యతిరేకంగా సభలు పెట్టి మంత్రి పదవి కోసం బ్లాక్ మెయిల్ రాజకీయాలు చేస్తున్నారని ఇలాంటి బ్లాక్ మెయిల్ రాజకీయాలు ఉపేక్షించలేదని విమర్శించారు. ఎంఎస్పీ మండల అధ్యక్షుడు జిల్లెల నాగరాజు, దుర్గయ్య నాయకులు ఉన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు విరాళం



ఎస్సైకి చెక్కు అందజేస్తున్న మధుకర్‌రెడ్డి

కాటారం: పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న సీసీ కెమెరాల కోసం వ్యాపారులు, నాయకులు, యువకులు, ప్రజలు తమ వంతు సహకారం అందిస్తున్నారు. ఇందులో భాగంగా మండల కేంద్రానికి చెందిన సింగిరెడ్డి మధూకర్‌రెడ్డి సీసీ కెమెరాల కోసం రూ.10 వేల విలువ గల చెక్కును విరాళంగా ఎస్సై మ్యాక అభినవ్‌కు మంగళవారం అందించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. సీసీ కెమెరాల ఏర్పాటు కోసం విరాళాలు ఇవ్వడానికి ముందుకు రావడం అభినందనీయం అన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- ఏఎస్సై కుమారస్వామి



వాహనాన్ని తనిఖీ చేస్తున్న ఏఎస్సై

టేకుమట్ల: అసాంఘిక వ్యక్తులపై ప్రజలు నిత్యం అప్రమత్తంగా ఉండాలని ఏఎస్సై దాట్ల కుమారస్వామి అన్నారు. మావోయిస్టు వారోత్సవాల నేపథ్యంలో మంగళవారం మండలంలోని వెల్లంపల్లిలో వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అనుమానితుల పూర్తి వివరాలను తెలుసుకుని వదిలిపెట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారికి ఆశ్రయం కల్పించొద్దని సూచించారు. ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. గ్రామాల్లో ప్రశాంత వాతావరణం ఉండాలంటే ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని కోరారు. ఆయన వెంట సివిల్, టీఎస్ఎస్పీ కానిస్టేబుళ్లు ఉన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి

- మండల ప్రత్యేకాధికారి వెంకటేశ్వర్లు



వంటసామగ్రిని పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి

కాటారం: విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని వేడిగా వండిన పదార్థాలను అందించాలని మహాముత్తారం మండల ప్రత్యేకాధికారి వెంకటేశ్వర్లు పాఠశాల సిబ్బందికి సూచించారు. మండలంలోని మాదారంలోని గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలను మంగళవారం ప్రత్యేకాధికారి తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలు, సౌకర్యాలు, తరగతి గదుల నిర్వహణ, పారిశుద్ధ్యం, వంటగది, డైనింగ్ హాల్, ఆహారపదార్థాల నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా.. పూర్తి సౌకర్యాలు ఉన్నాయా అని ఆరా తీశారు. ప్రత్యేకాధికారి వెంట పాఠశాల ప్రిన్సిపాల్, సిబ్బంది ఉన్నారు.

బైక్ ర్యాలీని విజయవంతం చేయండి



మాట్లాడుతున్న నాయకులు

మొగుళ్లపల్లి: మొగుళ్లపల్లి, చిట్యాల, టేకుమట్ల మూడు మండలాలు కలిపి నేడు(బుధవారం) బీజేపీ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీని నిర్వహించనున్నట్లు ఆ పార్టీ సీనియర్ నాయకుడు జన్నె మొగిలి అన్నారు. మండల అధ్యక్షుడు శేషగిరి ఆధ్వర్యంలో మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో మొగిలి, నియోజకవర్గ కన్వీనర్ మోరే రవీందర్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం సంవత్సర కాలంలో ఇచ్చినటువంటి ఒక్క హామీని పూర్తిగా నెరవేర్చకుండా కాలయాపన చేస్తూ ప్రజలను మభ్యపెడుతుందన్నారు. రూ.రెండు లక్షల పైన ఉన్నటువంటి రైతులకు రుణమాఫీ చేయలేదన్నారు. కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయలేదని, రైతు భరోసా ఇవ్వలేదన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



ఆర్థిక సాయం అందిస్తున్న కమిటీ సభ్యులు

చిట్యాల: మండల కేంద్రంలోని వెంకట్రావుపల్లి(సీ) గ్రామానికి నద్దునూరి భద్రయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని అదే గ్రామానికి చెందిన అంబేడ్కర్ నగర్ అభివృద్ధి కమిటీ సభ్యులు మంగళవారం పరామర్శించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులకు 50 కిలోల బియ్యంతో పాటు రూ.2,200ల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు పుల్ల సతీష్‌కుమార్, గ్రామస్తులు పుల్ల మల్లయ్య, దూడపాక సాంబయ్య, కనకం తిరుపతి, పుల్యాల సురేష్, లద్దునూరి ప్రభు, సదయ్య, కుమార్, దేవేందర్, శ్రీకాంత్, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

అంగవైకల్యం అభివృద్ధికి అడ్డుకాదు

- ఎంఈఓ కుమారస్వామి



కాళేశ్వరం: బహుమతులు అందజేస్తున్న హెచ్‌ఎంలు

మొగుళ్లపల్లి: అంగవైకల్యం అభివృద్ధికి అడ్డుకాదని దివ్యాంగులు అన్ని రంగాల్లో ముందు ఉండాలని ఎంఈఓ కుమారస్వామి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని విద్యావనరుల కేంద్రంలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు ఆటల పోటీలను నిర్వహించారు. అనంతరం దివ్యాంగ విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. ఉపాధ్యాయులు భిక్షపతి, సధాకర్, చంద్రమౌళి, వేణు, సదయ్య, కవిత వసంత, అనిల్ కుమార్, శివకుమార్ పాల్గొన్నారు.

చిట్యాల: మండల కేంద్రంలోని భవిత సెంటర్‌లో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని సెంటర్ ఐఈఆర్పీ (ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ పర్సన్) సంద మహేందర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంఈఓ కొడెపాక రఘుపతి హాజరై మాట్లాడారు. దివ్యాంగులపై ప్రేమ, అనురాగం, శ్రద్ధ, పోత్సాహం ఉండాలని అన్నారు. ఉన్నత పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు శ్రీరాం రఘుపతి, ఫీజికల్ డైరెక్టర్ సాంబమూర్తి, ఉపాధ్యాయులు సదయ్య, స్పెషల్ ఎడ్యూకేటర్ రాజేష్, కళావతి పాల్గొన్నారు.



మల్హర్: మాట్లాడుతున్న శారద



చిట్యాల: బహుమతులు అందజేసిన ఎంఈఓ

మల్హర్: మండలంలోని కొయ్యూరు ప్రాథమిక పాఠశాలలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు శారద మాట్లాడుతూ.. సమగ్ర శిక్షణ ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సేవలను వినియోగించుకోవాలని కోరారు. అనంతరం నిర్వహించిన ఆటల పోటీల్లో విజయం సాధించిన దివ్యాంగులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు శాంతిలత, స్పెషల్ ఎడ్యూకేటర్ ప్రగతి, ఐఆర్‌పీలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పలిమెల: మండల కేంద్రంలోని ఎంపీయూపీఎస్ పాఠశాలలో ఎంపీడీఓ శ్రీనివాస్ మాట్లాడుతూ.. అంగవైకల్యం దేనికి అడ్డుకాదన్నారు. విద్యార్థులు మంచి లక్ష్యాలను నిర్దేశించుకొని భవిష్యత్‌లో ఉన్నతంగా స్థిరపడాలన్నారు. అనంతరం వికలాంగ పిల్లలు, వారి తల్లిదండ్రులకు ఐఆర్‌పీ సృజనా, ఫిజియోథెరపిస్ట్ జగదీశ్ ఫిజియో సైకాలజికల్ సోషల్ లాజికల్ అండ్ ఎన్విరాన్‌మెంట్ ఎడ్యుకేషన్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా దివ్యాంగ విద్యార్థులను అధికారులు సన్మానించారు. ఎంపీఓ ప్రకాశ్‌రెడ్డి, పాఠశాల హెచ్‌ఎం రాజేంద్రప్రసాద్, శ్రీధర్ పాల్గొన్నారు.

టేకుమట్ల: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో దివ్యాంగ విద్యార్థులకు ఆటల పోటీలను నిర్వహించి ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులను అందించారు. ఈ కార్యక్రమానికి మండల విద్యాధికారి సుదాకర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. దివ్యాంగ విద్యార్థులు అన్ని రంగాల్లో ప్రతిభ చాటి వైకల్యాన్ని జయించాలన్నారు.

సింగరేణి ఆధ్వర్యంలో..



బహుమతులు ప్రదానం చేస్తున్న కావూరి మారుతి

భూపాలపల్లి రూరల్: ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని సింగరేణి యాజమాన్యం అంబేడ్కర్ స్టేడియంలో వేడుకలు నిర్వహించారు. ఈవేడుకలకు ముఖ్య అతిథిగా సింగరేణి భూపాలపల్లి ఏరియా అధికార ప్రతినిధి పర్సనల్ మేనేజర్ కావూరి మారుతి హాజరయ్యారు. ఈ సందర్భంగా దివ్యాంగ విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు పాషా, ఐఎన్‌టీయూసీ వైస్ ప్రెసిడెంట్ మధుకర్ రెడ్డి, క్రీడల సెక్రటరీ శ్రావణ్ కుమార్, స్పోర్ట్స్ సూపర్వైజర్ శ్రీనివాస్, హెచ్ ఎమ్ఆర్‌డీ స్కూలు కరస్పాండెంట్ రజిత, క్రీడల కోఆర్డినేటర్ తిరుమల్, సేవ కోఆర్డినేటర్ ప్రవీణ్ పాల్గొన్నారు.

కాళేశ్వరం: మండలం కేంద్రంలోని జెడ్పీహెచ్ బాలుర పాఠశాలలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బాలురు, బాలికల పాఠశాలల హెచ్‌ఎంలు రాజిరెడ్డి, సరిత మాట్లాడుతూ అంగవైకల్యం శరీరానికే కాని మనసుకు కాదన్నారు. విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. ఆనంద్, కవిత, పంకజ, అనిత, ప్రకాష్, వింధ్యారాణి, తిరుపతి, కృష్ణారావు, రంగారెడ్డి ఉన్నారు.



మొగుళ్లపల్లి: బహుమతులు అందజేస్తున్న ఎంఈఓ కుమారస్వామి



టేకుమట్లలో..



పలిమెల: విద్యార్థులను సన్మానిస్తున్న అధికారులు

కలప పట్టివేత



వెంకటాపురం(ఎం): మండలంలోని బండ్లపహాడ్ సమీప అటవీప్రాంతం నుంచి 5 ఎండ్ల బండ్లలో లక్షా యాభై వేల రూపాయాల విలువ చేసే కలపను అక్రమంగా తరలిస్తుండగా స్వాధీనం చేసుకోని ములుగు రేంజ్ కార్యాలయానికి తరలించినట్లు ములుగు ఎఫ్ఆర్ఓ శంకర్ తెలిపారు. వెంకటేశ్వర్లపల్లి గ్రామానికి చెందిన రజాకర్, రాజు, రమేష్, లచ్చుమల్లు, శంకర్‌లు ఐదు ఎండ్లబండ్లలో ఏడు దిమ్మెలు భూపాలపల్లి జిల్లా దూదేకులపల్లి నుంచి అక్రమంగా తీసుకొని వస్తుండగా తమకు అందిన సమాచారం మేరకు బండ్లపహాడ్ వద్ద దాడి చేసి పట్టుకున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అటవీశాఖ సిబ్బంది యాకూబ్ జానీ, రంజిత్, హనుమంతు, రాజేశ్వరి, శివశంకర్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.